సంగారెడ్డి
నమస్తే తెలంగాణ
శనివారం 1 మార్చి 2025
SATURDAY, MARCH 1, 2025

డీడీఎస్ మహిళల కృషి అమోఘం

రైతుల పరిరక్షణ సదస్సును ప్రారంభిస్తున్న పీపీవీఎఫ్‌ఆర్‌ఏ చైర్మన్ త్రీలోచన మహాపాత్ర

- చిరుధాన్యాల పరిరక్షణ అభినందనీయం
- విత్తనాలను తప్పక రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి
- కేంద్ర పీపీవీఎఫ్‌ఆర్‌ఏ చైర్మన్ త్రీలోచన్ మహాపాత్ర

జహీరాబాద్, ఫిబ్రవరి 28 : పాత పంటలైన చిరుధాన్యాలను పరిరక్షించేందుకు డీడీఎస్ మహిళా సంఘం సభ్యులు చేస్తున్న కృషి ఎనలేనిదని కేంద్ర ప్రొటెక్షన్ ఆఫ్ ప్లాంట్ వెరైటీస్ అండ్ ఫార్మర్స్ రైట్స్ అథారిటీ(పీపీవీఎఫ్‌ఆర్‌ఏ) చైర్మన్ త్రీలోచన మహాపాత్ర కొనియాడారు. జహీరాబాద్ మండలంలోని దిడ్గి గ్రామ శివారులోని డీడీఎస్-కేవీకే కేంద్రంలో ఐసీఆర్ అటార్నీ జోన్-10 ఆధ్వర్యంలో శుక్రవారం 'పంటల రకాలు-రైతుల పరిరక్షణ చర్యల'పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 40 ఏండ్లుగా జహీరాబాద్ ప్రాంతంలో డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు పాత పంటలను కాపాడుతూ, భవిష్యత్తు తరాలను అందించేందుకు చేస్తున్న కృషి అమోఘం అన్నారు. డీడీఎస్ మహిళా రైతులు చంద్రమ్మ, లక్ష్మమ్మ, అంజమ్మ తదితరులు 80 రకాలకు పైగా చిరుధాన్యాల విత్తనాలను డీడీఎస్ మహిళ రైతుల ఇంట్లో విత్తన బ్యాంకులో భద్రపర్చుకొని, అవసరమైన రైతులకు పంటల సాగుకు అందించడంపై భేష్ అన్నారు. ఒక్కో డీడీఎస్ మహిళ ఒక్కో విత్తన బ్యాంకు అని కొనియాడారు. భూమిని మన పేరు మీద ఏవిధంగా రిజిస్టర్ చేసుకుంటామో, అదే విధంగా విత్తనాలు, పంట, చెట్టు మీద పీపీవీఎఫ్‌ఆర్‌ఏలో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రాలు రైతులు చేస్తున్న పనులను గుర్తింపు వచ్చేలా కృషి చేయాలన్నారు. రైతులు పరిరక్షిస్తున్న పంటలను రిజిస్టర్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాత పంటల పరిరక్షించేందుకు కృషి చేస్తున్న జహీరాబాద్ డీడీఎస్‌కు త్వరలోనే కేంద్ర పీపీవీఎఫ్‌ఆర్‌ఏ ద్వారా అవార్డును అందిస్తామని ప్రకటించారు.

సహకారం అందిస్తాం..
- డాక్టర్ దీకే అగర్వాల్

కేంద్ర పీపీవీఎఫ్‌ఆర్‌ఏ రిజిస్టర్ డాక్టర్ దీకే అగర్వాల్ మాట్లాడుతూ.. పాత పంటలైన చిరుధాన్యాలను కాపాడుతూ రైతులకు అవగాహన కల్పించేందుకు ఎంతో కృషి చేస్తున్నారని అభినందించారు. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 19,700 పంటలను రిజిస్టర్ చేసుకునేందుకు పీపీవీఎఫ్‌ఆర్‌ఏ దరఖాస్తులు వచ్చాయని, అందులో తెలంగాణ ప్రాంతం నుంచి 14శాతం రిజిస్టర్ చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. అందులో జహీరాబాద్ ప్రాంతం నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. చిరుధాన్యాల పరిరక్షించేందుకు కృషి చేస్తున్న డీడీఎస్ మహిళా సంఘాలు తమ వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని పేర్కొన్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
-జనరల్ షేక్ ఎన్ మీరా

ఐసీఆర్ అటార్నీ-10 జనరల్ షేక్ ఎన్ మీరా మాట్లాడుతూ.. జహీరాబాద్ అడ్డా-చిరుధాన్యాలకు గడ్డగా మారిందని పేర్కొన్నారు. సాంప్రదాయ విత్తనాలను పరిరక్షించకపోతే మనం పండించే పంటలకు గుర్తింపు ఉండదన్నారు. పంటల పరిరక్షణ చర్యలో భాగంగా రిజిస్ట్రేషన్ చేసేందుకు కేంద్ర పీపీవీఎఫ్‌ఆర్‌ఏ చైర్మన్, రిజిస్టర్‌లు జహీరాబాద్ ప్రాంతంలోని దిడ్గి డీడీఎస్-కేవీకే కేంద్రానికి రావడం సంతోషంగా ఉందని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో బయో పైరసీ నుంచి కాపాడుకోవచ్చన్నారు. తప్పని సరిగా పీపీవీఎఫ్ ఆర్‌ఏలో పంటలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రాంతంలో ని కృషి విజ్ఞాన కేంద్రాల పరిధిలోని రైతులు సాగుచేసి పరిరక్షించేందుకు కృషి చేస్తున్న పంటలను రిజిస్ట్రేషన్ చేయిస్తే శాస్త్రవేత్తలకు మంచి పేరు వస్తుందన్నారు.

శాస్త్రవేత్తలు, రైతులకు సన్మానం

అనంతరం తెలంగాణలోని కృషి విజ్ఞాన కేంద్రాల పరిధిలోని పంటల పరిరక్షించేందుకు కృషిచేస్తున్న శాస్త్రవేత్తలు, రైతులను ఘనంగా సన్మానించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. డీడీఎస్-కేవీకే ఆధ్వర్యంలో రైతుల పంటల సాగులో అధిగ దిగుబడులు, చీడపురుగుల నివారణ చర్యలపై శాస్త్రవేత్తలు రూపొందించిన కృషి వార పత్రికను పీపీవీఎఫ్ ఆర్‌ఏ చైర్మన్ త్రీలోచన మహాపాత్ర అవిష్కరించారు. తెలంగాణలోని 16 కృషి విజ్ఞాన కేంద్రాల పరిధిలోని పంటలను పరిరక్షిస్తున్న 100 మందికి పైగా రైతులు పీపీవీఎఫ్‌ఆర్‌ఏలో రిజిస్ట్రేషన్ కోసం పేర్లను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డీజే అరవిందకుమార్, హరిప్రసన్న, జహీరాబాద్ డీడీఎస్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యుడు జీవీ రామాంజనేయులు, డీడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్వ వెలుగురి, డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ వరప్రసాద్, స్వామి, కైలాస్, రామేశ్, హేమలత, స్నేహలత, శైలజ, డీడీఎస్ లైజన్ ఆఫీసర్ మాణిక్యం, మహిళా సభ్యులు జనరల్ నర్సమ్మ, పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతును సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న చైర్మన్ తీలోచన మహాపాత్ర

2న ఐఐటీహెచ్‌కు ఉపరాష్ట్రపతి రాక

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

కంది, ఫిబ్రవరి 28: సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీ హైదరాబాద్‌కు మార్చి 2న భారత ఉపరాష్ట్రపతి జగదీశ్ దన్‌ఖడ్ రానున్నట్లు కలెక్టర్ వల్లూరి క్రాంతి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా ఉన్నతాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లు, ఇతర ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూ చించారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రంజాన్‌కు తగిన ఏర్పాట్లు చేయాలి

మున్సిపల్ కమిషనర్ తిరుపతికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు

అందోల్, ఫిబ్రవరి 28 : రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మసీద్‌లు, ఈద్గా పరిసరాలు శుభ్రం చేయించడంతో పాటు తగిన సౌకర్యాలు కల్పించాలని కో-ఆప్షన్ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు అర్ఫత్ స్థానిక ముస్లింలు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి శుక్రవారం మున్సిపల్ కమిషనర్ తిరుపతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేపటి నుంచి ముస్లింల పవిత్రమాసమైన రంజాన్ మాసం ప్రారంభం కానున్నదని, దీన్ని దృష్టిలో పెట్టుకొని తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పరిసరాలు శుభ్రం చేయడంతో పాటు మంచినీరు, ఇతర ఏర్పాట్లు చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు మహబూబ్‌ఖాన్, అలీషాఖాన్, మజీద్, మంజూర్, హాజీ, నవాజ్, నజీర్, హుస్సేన్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి

వట్‌పల్లి, ఫిబ్రవరి 28 : సర్వమత సన్నిధి సద్గురు వెంకట్ ఖ్వాజా దర్గాను రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి శుక్రవారం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా అశ్రమ నిర్వాహకులు మఠం భిక్షపతికి ఘనస్వాగతం పలికారు. అనంతరం అప్పగారికి మండల నాయకులతో కలిసి గంధం సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బీఆర్ఎస్ మండల నాయకులు శివాజీరావు, అశోక్ గౌడ్, మధు, నరేందర్ రెడ్డి, ప్రకాశ్, ఎల్లాగౌడ్, శ్రీపాద్ రెడ్డి, నర్సింహులు, అశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రాయికోడ్ ప్రాథమిక పాఠశాలలో భోజనాన్ని పరిలిస్తున్న అధికారి మోహన్‌రావు

రాయికోడ్, ఫిబ్రవరి 28 : గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పీఎం పోషణ్ అడిట్ అధికారి మోహన్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన రాయికోడ్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఎంఈవో అంజయ్య, హెచ్ ఎం శ్రీనివాస్, సిబ్బంది సుమలత, యాదవులు ఉన్నారు.

టైలర్స్‌కు అండగా నిలుస్తాం..

సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు, ఫిబ్రవరి 28 : టైలర్స్‌కు అండగా నిలుస్తానని పటాన్‌చెరు డివిజన్ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం బచ్చుగూడెంలో దర్జీ సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దర్జీ లేని ఆధునిక జీవితం ఊహించలేమన్నారు. నేడు రెడీమేడ్ వస్త్రాల ధాటికి టైలర్స్ ప్రభావం కోల్పోతున్నారన్నారు. టైలర్ సంఘ భవన నిర్మాణానికి రూ. 5లక్షలు అందజేస్తానని కార్పొరేటర్ హామీనిచ్చారు. కార్యక్రమంలో పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్లు సఫానదేవ్, శంకర్ యాదవ్, గూడెం మధుసూదన్‌రెడ్డి, నర్రా భిక్షపతి, విజయ్ కుమార్, నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఝరాసంగం, ఫిబ్రవరి 28 : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ కల్యాణ మండపంలో పార్వ తీ పరమేశ్వరుల కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. కల్యాణంలో 50 మం ది దంపతులు పాల్గొన్నారు. కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు పార్వతీ సమేత పరమేశ్వరుల పాదాలపై అక్షింతలు వేసి స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. జాతర ప్రత్యేక అధికారిణి సులోచన, దేవాదాయ ధర్మదాయ ఇన్‌స్పెక్టర్ రంగరావు, చాకరిమెట్ల ఈవో సారా శ్రీనివాస్, కేతకీ ఈ వో శివరుద్రప్ప, మాజీ సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, మాజీ జడ్పీ చైర్మన్ సునీతా హన్మంత్‌రావు పాటిల్ దంపతులు, బీఆర్ఎస్ ఝరా సంగం పట్టణాధ్యాక్షుడు ఏజాజ్ బాబా, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రుద్రప్ప పాటిల్, మాజీ సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్, ఎంపీ సంతోశ్ పాటిల్, బస్వరాజ్ పటేల్, గొల్ల నర్సింహులు, భక్తులు పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి

మొగుడంపల్లిలో రైతులకు అందజేసిన డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారి

జహీరాబాద్, ఫిబ్రవరి 28 : రాయితీపై అందించే డ్రిప్, బిందు సేద్యం పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి సోమేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం జహీరాబాద్ నియోజకవర్గంలోని మండల కేంద్రమైన మొగుడంపల్లి, జహీరాబాద్ మండలంలోని మల్చేల్మా, చిన్న హైదరాబాద్ గ్రామాల్లో రైతులకు అందజేసిన డ్రిప్, బిందు సేద్యం పరికరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ డ్రిప్, బిందు సేద్యం ద్వారా తక్కువ పెట్టుబడి, తక్కువ నీటితో పంటల అధిక దిగుబడిని సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో జైన్ డ్రిప్, నేట్ ఫిమ్ కంపెనీల డీసీవో విజయ్‌కుమార్, పాండు, డీలర్లు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ పోటీలకు రాయపోల్ విద్యార్థులు

రాయపోల్,ఫిబ్రవరి 28 : సౌత్‌జోన్ జాతీయ స్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి. అరవింద్ ఎంపికైనట్లు ఆపాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, పీఈటీ గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. మార్చి 1 నుంచి 3వ తేదీ వరకు నల్లగొండ జిల్లా ఎన్‌జీ కళాశాల స్టేడియంలో నిర్వహించే 4వ సౌత్ జోన్ షూటింగ్ బాల్ పోటీలో అరవింద్ ప్రాతినిథ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. సౌత్‌జోన్ షూటింగ్ బాల్‌పోటీలకు ఎంపికైన విద్యార్థిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ యువకులు అభినందించారు.

వైభవంగా భ్రమరాంబ మల్లికార్జున ఉత్సవాలు

స్వామివారికి వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు ఆలయ కమిటీ సభ్యులు

అమీన్‌పూర్, ఫిబ్రవరి 28 : మూడు రోజులుగా బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తిలకించారు. కమిటీ అధ్యక్షుడు బైస సుధాకర్, కమిటీ సభ్యులు ఎల్కర్తి మల్లేశ్ యాదవ్, కొల్లి మల్లేశ్, దండు నిర్మల దీపక్, మహిపాల్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

పలువురు కుటుంబాలకు హరీశ్‌రావు పరామర్శ



నంగునూరులో మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నంగునూరు, ఫిబ్రవరి 28 : మండల పరిధిలోని అంక్షాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పిల్లి జనార్దన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం మాజీ మంత్రి హరీశ్‌రావు జనార్దన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. నంగునూరుకు చెందిన మాజీ ఉప సర్పంచ్ మహేందర్‌రెడ్డి తండ్రి ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబాన్ని, మాజీ వార్డు మెంబర్ కోల నర్సింహులు భార్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, వారి కుటుంబాన్ని హరీశ్‌రావు పరామర్శించారు.

న్యాయవాదులతో సమీక్ష

సిద్దిపేట టౌన్,ఫిబ్రవరి 28 : తెలంగాణ న్యాయసేవాధికార సంస్థ సూచనల మేరకు జిల్లా కోర్టు సమావేశం మందిరంలో శుక్రవారం లీగల్ సర్వీస్ చిల్డ్రన్స్ స్కీంపై ప్యానల్ న్యాయవాదులు, ప్యారా లీగల్ వలంటీర్లతో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, జడ్జి స్వాతిరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ వలంటీర్లకు చిల్డ్రన్స్ స్కీంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపవాస దీక్ష క్యాలెండర్ ఆవిష్కరణ

రంజాన్ ఉపవాస దీక్ష క్యాలెండర్‌ని ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 28 : రంజాన్ ఉపవాస దీక్షలకు సంబంధించిన క్యాలెండర్‌ని మైనార్టీ నాయకులతో కలిసి శుక్రవారం బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజక వర్గ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి ఆవిష్కరించారు. మైనార్టీ నాయకులు ఆర్సీపురంలోని ఆదర్శ్ రెడ్డి నివాసంలో ఆయనను ప్రత్యేకంగా కలిసి సన్మానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రంజాన్‌ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించి ముస్లింలకు ఇఫ్తార్ దావత్, పండుగతోఫాలను అందజేసిందని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో పండుగలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో అజీముద్దీన్, గౌస్, యూసుఫ్, జావిద్, బాబా, జాకీర్, షకీల్, గిరి, నరేశ్, జాన్సన్ పాల్గొన్నారు.

వ్యక్తి మెడలోంచి గొలుసు చోరీ

అందోల్, ఫిబ్రవరి 28 : వ్యక్తి మెడలోంచి గుర్తుతెలియని వ్యక్తులు బంగారు గొలుసును లాక్కెళ్లిన సంఘటన జోగిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి జోగిపేట ఎస్సై పాండు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సంగుపేటకు చెందిన డప్పు బాబురావు అల్మాయిపేట్ శివారుల్లో రిమ్‌జిమ్ దాబా వద్ద నిలబడగా గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు బైక్‌లపై వచ్చి మెడలోంచి 2 తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. దీంతో బాధితుడు జోగిపేట ఠాణాలో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాడ్దానిపల్లిని సందర్శించిన జడ్పీ సీఈవో

గ్రామంలో తవ్వించిన గుంతను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో జానకిరెడ్డి

చౌటకూర్, ఫిబ్రవరి 28 : మండలంలోని తాడ్దానిపల్లి గ్రామాన్ని జిల్లా ప్రజా పరిషత్ సీఈవో జానకిరెడ్డి శుక్రవారం సందర్శించారు. గ్రామంలో రోడ్డు పక్కన తవ్వించిన గుంతలో మురుగు నిలిచి దుర్గంధం వ్యాపిస్తున్నదని వచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన గ్రామాన్ని సందర్శించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చౌటకూర్ ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఎంపీడీవో కార్యాలయంలో సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వెంట ఎంపీడీవో శంకర్, పీఆర్ ఏఈఈ శశి కుమార్, పంచాయతీ కార్యదర్శులు సందీప్‌గౌడ్, సిద్దమ్మ, కారోబార్ జాఫర్, జూనియర్ సహాయకుడు ప్రీతం నాయక్, సిబ్బంది ఉన్నారు.

నంగునూరులో మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

అందోల్: తాలెల్లలో సైన్స్‌ఫెయిర్‌లో తయారుచేసిన నమూనా ప్రదర్శిస్తున్న విద్యార్థిని

జహీరాబాద్: శ్రీవాణీ విద్యాలయంలో ప్రదర్శనలను తిలకిస్తున్న జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు

కంది : ఎద్దుమైలారం జడ్పీహెచ్‌ఎస్‌లో జాతీయ సైన్స్ దినోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రతి ఆలోచన ఒక గొప్ప ఆవిష్కరణకు నాంది

జిల్లాలో ఘనంగా సైన్స్ డే వేడుకలు

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 28 : సర్ సీవీ రామన్ జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో ఎన్ఎస్ఎస్, సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు. సర్ సీవీ రామన్ చెప్పినట్టు ప్రతి ఆలోచన ఒక గొప్ప పరిశోధనకు,ఆవిష్కరణకు కారణమవుతుందని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయ్య కుమార్, డాక్టర్ సుమతిదేవి, ఆయా శాఖల విభాగధిపతులు పాల్గొన్నారు.

జిల్లా సైన్స్ కేంద్రంలో..

జిల్లా కేంద్రంలోని సర్ సీవీ రామన్ సైన్స్ కేంద్రంలో జాతీయ సైన్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన గణిత ప్రాజెక్టులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి లింబాజీ, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, సదాశివపేట పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వాతి, కరెస్పాండెంట్ హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి కలెక్టరేట్ : పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ సైన్స్ డే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

రోడ్డుపై చెత్త వేసిన ఇద్దరికి జరిమానా

జరిమానా విధించి రసీదు అందజేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్

జిన్నారం ఫిబ్రవరి 28 : జిన్నారం మండలం, బొల్లారం మున్సిపల్ పరిధిలోని జ్యోతినగర్‌లో రోడ్డుపైనే చెత్త వేస్తున్న వ్యక్తులను గుర్తించిన మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. కమిషనర్ మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ రోడ్డుపైనే చెత్త వేసిన ఇద్దరు వ్యక్తులకు జరిమానా విధించి రసీదు అందజేశారు. మున్సిపాలిటీ స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎట్టి పరిస్థితుల్లో బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎల్ఆర్ఎస్ చెల్లిస్తే, రాయితీ

రామచంద్రాపురం, ఫిబ్రవరి 28 : రిజిస్టర్ ప్లాట్లకు సంబంధించి మార్చి 31లోగా ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ లభిస్తుందని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఆర్ఎస్ 2020 పథకానికి సంబంధించి ఇటీవల కాలంలో మార్పులు చేశామని, అన్ రిజిస్టర్ ప్లాట్లను రిజిస్టర్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించి రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు. ఎల్ఆర్ఎస్ ఫీజులో 25 శాతం రాయితీ గురించి విస్తృత ప్రచారం కోసం మున్సిపల్ కార్యాలయంలో సిటిజన్ సర్వీస్ సెంటర్, ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్‌ని ఏర్పాటు చేశామన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

యువకుడు ఆత్మహత్య

సదాశివపేట, ఫిబ్రవరి 28 : ఉరివేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పొట్టిపల్లిలో శుక్రవారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొట్టిపల్లి గ్రామానికి చెందిన మునిపల్లి బాలమణి కుమారుడు సతీశ్ (28) దినసరి కూలీ. సతీశ్ మద్యం తాగడానికి అలవాటు పడి భార్యతో గొడవపడేవాడు. ఈ నెల 27న రాత్రి భోజనం చేసిన తర్వాత గదిలోకి వెళ్లి దూలానికి చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి బాలమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వాటర్ ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడి మృతి

సదాశివపేట, ఫిబ్రవరి 28 : మున్సిపల్ వాటర్ ట్రాక్టర్‌ను ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన సంఘటన పట్టణంలోని ప్రధాన రహదారిపై శుక్రవారం చోటుచేసుకున్నది. సీఐ మహేశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గురునగర్‌కాలనీలో నివాసం ఉంటున్న సాయికార్తీక్ (18) ఇంటర్మీడియట్ మొదటి సంవవత్సరం చదువుతున్నాడు. స్కూటీపై గురునగర్ కాలనీ నుంచి బస్టాండ్ వైపు వెళ్తుండగా ఆస్రా కాంప్లెక్స్ వద్ద ప్రధాన రహదారి డివైడర్ మధ్యలో మొక్కలకు నీళ్లు పడుతున్న మున్సిపల్ ట్రాక్టర్‌ను వెనక నుంచి ఢీకొట్టాడు. సాయికార్తీక్‌కు తీవ్రగాయాలు కావడంతో దవాఖానకు తరలిస్తుండగా, మార్గ మధ్యలో మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ఝరాసంగం, ఫిబ్రవరి 28 : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఈదులపల్లి గ్రామానికి చెందిన ఏసురత్నం (56) అదే గ్రామంలో చర్చి నూతన భవన నిర్మాణానికి నీళ్లు పడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య ఫి